క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట: స్థానిక సబ్‌స్టేషన్‌లో పరిధిలో ఉన్న గ్రామాలకు ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శనివారం తెలిపారు. మాచవరంలో వెంకటేశ్వర కాలనీ, మాచవరం రోడ్డు, మంచాలవారి వీధి, ఓఎన్‌జీసీ రోడ్డు, దొమ్మేటివారిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను తొలగించి మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రైతు అంగీకారంతో పైప్‌లైన్ ఏర్పాటు



రైతు సర్వేశ్వరరావును అభినందిస్తున్న సర్పంచ్ ప్రకాశరావు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో 10 కుటుంబాలకు జల్‌జీవన్ మిషన్ ద్వారా 200 మీటర్ల మేర పైప్‌లైన్ వేసేందుకు స్థానిక రైతు పెదమల్లు మల్లికార్జునుడు శనివారం అంగీకారం తెలిపారు. తన సొంత జిరాయితీ భూమి నుంచి పైప్‌లైన్ వేసేందుకు సమ్మతించారని సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు చెప్పారు. పైప్‌లైన్ ఏర్పాటుకు అంగీకారం తెలిపిన మల్లికార్జునరావుతో పాటు అతని కుమారుడు రామలింగసర్వేశ్వరరావును సర్పంచ్ సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీటీసీ పాలమూరి సత్తిబాబు, స్థానికులు అభినందించారు. గతంలో కూడా పైన పేర్కొన్న కుటుంబాలకు విద్యుత్ లైన్ వేసేందుకు సహకరించారని చెప్పారు.

రబీ పనుల వేళ ఉపాధి పనులు ఆపండి

మలికిపురం: వరి కోతలు ప్రారంభం అవుతుండగా మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నారని, వాటిని వెంటనే నిలుపుదల చేసి రైతులకు మేలు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం పంపారు. ఈ మేరకు మలికిపురం రైతులు విలేకరులతో మాట్లాడారు. రైతాంగానికి నష్టం లేకుండా వరి కోతల సమయం పూర్తయ్యాక ఉపాధి పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా పాళ్లమ్మ జాతర

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ జాతర శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవాన్ని ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. అమ్మవారికి శనివారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సన్నిధిలో జరిగిన కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భారీగా విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు.

డీఈఓ, ఎంఈఏ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు

కొత్తపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీఎం కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ), మెడికల్ ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ (ఎంఈఏ) కోర్సుల ఉపాధి శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, డీఎస్‌డీఓ లోకమన్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారై ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, విద్యార్హత, 3 పాస్‌పోర్ట్ ఫొటోస్‌తో సోమవారం కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటి తలుపులు పగలగొట్టి చోరీ

మామిడికుదురు: తాళం వేసి ఉన్న ఇంటి వెనుక వైపు తలుపులు పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన సంఘటన కరవాక గ్రామంలో జరిగింది. దీనిపై బాధితుడు మన్నే శ్రీనివాసరావు శనివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. శ్రీనివాసరావు పంచాయతీ పక్కన ఉన్న తన ఇంట్లో కిరాణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడని ఎస్సై చెప్పారు. శ్రీనివాసరావు భార్య అనారోగ్యంతో ఉండడంతో వారి కుటుంబ సభ్యులంతా రెండు నెలల నుంచి గొల్లపాలెంలోని తన సోదరుడి ఇంట్లో ఉంటున్నారన్నారు. అతని కుటుంబ సభ్యులు ప్రతి రోజు ఇంటికి వచ్చి కిరాణా సరుకులు అమ్ముకుని వెళ్తుంటారన్నారు. ప్రతిరోజు మాదిరిగా ఇంటికి వచ్చే సరికి వెనుక తలుపులు పగలగొట్టి ఉండడం చూసి ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు. ఇంట్లోని బీరువా తాళాలు పగలగొట్టి అందులోని కొంత నగదు, బంగారం, వెండి తీసుకుపోయారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ,
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఆటలమ్మ సోకిన చిన్నారి

అంబాజీపేట: వేసవి ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్ (ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటు వ్యాధులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నిరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 53 మంది, కొత్తపేట నియోజకవర్గంలో 41, రాజోలు నియోజకవర్గంలో 34 మంది ఆటలమ్మ, గవదబిళ్లల సమస్యలతో బాధపడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవద బిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్‌పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరు వెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

> **వైద్యులను సంప్రదించాలి**
>
> 
>
> ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి
>
> – వి.గౌతమి, వైద్యాధికారి, అంబాజీపేట పీహెచ్‌సీ

జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం ప్రతిపక్షాలకు లేదు



రామరాజులంకలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: నిరంతరం ప్రజలలో ఉండి ప్రజా సంక్షేమం కోసం పరితపించే దేశంలోనే అరుదైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం ప్రతిపక్షాలకు లేదని అందుకే తప్పుడు ప్రచారాలకు దిగుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని రామరాజులంకలో శనివారం మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఏమేమి పథకాలు అందుతున్నాయని వారిని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తీసుకువచ్చారని, అందుకోసమే వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. మహిళా సంక్షేమం కోసం, వారి ఆర్థికాభివృద్ధి కోసం కృతనిశ్చయంతో పని చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు, చింతా రాజబాబు, రావి గోపాలం, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి, గుండుమేను నారాయణమూర్తి, సాధనాల రంగా, వీవోఏ పెండ్యాల సూరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలపై ప్రజాభిప్రాయ సేకరణే లక్ష్యం



అంబాజీపేటలో లబ్ధిదారునికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ పథకాలను అందిస్తున్న తీరుపై ప్రజల సంతృప్తికంగా ఉన్నారో.. లేదో తెలుసుకోవడమే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్‌ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏం చేశామో చెప్పుకోలేని దుస్థితిలో గత ప్రభుత్వాలు ఉండేవని, నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాలను ప్రతీ గడపగడపకూ అందించామని అందుకే వారి ముందుకు ధైర్యంగా వెళుతున్నామన్నారు. వలంటీర్లు, గృహసారథులతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. వారి సంతృప్తి మేరకు ఇళ్లకు స్టిక్కర్లు అంటించి బ్రోచర్ అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వాసంశెట్టి వెంకన్న, సూదాబత్తుల రాము, కుసుమ వరలక్ష్మి, అప్పన శ్రీను తదితరులు పాల్గొన్నారు. వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పోతవరంలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు కలిగిన ప్రయోజనాన్ని తెలియజేశారు. గత చంద్రబాబు పాలనకు, ఇప్పుడు జగనన్న పాలనకు మధ్య తేడాలను వివరించారు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన ఫారాలను నింపి, ప్రజల అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, నగరం ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, పులపర్తి రాజారావు, మోకా శ్రీను, సబ్బితి చిన బాబు, గుత్తుల దాసు, మట్టపర్తి దుర్గాప్రసాద్, రామకృష్ణ, గరుడేశ్వరరావు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమానికి విశేష స్పందన లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అయినవిల్లి మండలంలోని శంకరాయగూడెంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు, వలంటీర్లు ప్రజలకు అండగా నిలుస్తారన్నారు. ఏ సమస్య వచ్చిన , ప్రభుత్వ పథకాలు అందాలన్నా వీరి సాయం తీసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని భరోసా కల్పించారు. సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, మట్టపర్తి స్వామి, గుత్తుల శ్రీరామ్మూర్తి, గుత్తుల మహాలక్ష్మి, బొక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువయ్యేందుకే..

అయినవిల్లి: ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని శంకరాయగూడెంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీఎంగా జగన్ విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి రామకృష్ణ, మట్టపర్తి వెంకటరమణ, మేడిశెట్టి శ్రీను, పెచ్చెట్టి రాంబాబు, సరిపల్లి కన్నబాబు రాజు, కడలి భూపతిరావు, దాసరి వీరాస్వామి తదితరులు ఉన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. మామిడికుదురు, నగరం, పెదపట్నం, పాశర్లపూడిలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, మొగలికుదురు, గెద్దాడ, ఆదుర్రు, మాకనపాలెం, పెదపట్నంలంక, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక, పాశర్లపూడి, లూటుకుర్రు, కొమరాడ, ఈదరాడ గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేశారు. చంద్రబాబు హయాంలో ప్రజల్ని ఏ విధంగా మోసం చేశారు. జగన్ సారథ్యంలో సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు అందుతున్నాయన్న వివరాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. కార్యక్రమాల్లో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, వాసంశెట్టి రామకృష్ణ, పార్టీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరంలో శనివారం నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లతో కలిసి వెళ్లి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లి నాడు–నేడు పాలనలో వ్యత్యాసాన్ని శివకుమార్ వివరించారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. సీఎం జగన్ వచ్చిన తరువాత పేదలకు, సామాన్యులకు జరుగుతున్న మేలును వివరించారు. లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేసి, వారి ఆమోదంతో వారి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ మిస్డ్ కాల్ చేయించారు.

ఉత్సాహంగా.. ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేసిన, చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రజలతో మమేకమవుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం గ్రామ గ్రామాన ఉత్సాహంగా కొనసాగుతుంది. ఎమ్మెల్యే పిలుపు మేరకు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటా కార్యక్రమాన్ని ఉత్సాహంగా.. చేపట్టారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలన వ్యత్యాసాన్ని తెలియజేసే కరపత్రాలను అందించారు. ఐదు ప్రశ్నలకు అభిప్రాయాలను సేకరించి, ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారు 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వగా ఆ తర్వాత నిమిషం లోపే సంబంధిత కుటుంబానికి ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా సీఎం జగన్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి అనుమతితో వారి ఇంటి తలుపుకు, మొబైల్ ఫోన్‌కు సీఎం జగన్ ఫొటో అతికిస్తున్నారు. తొలిరోజు నుంచీ గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతోంది. ప్రతి కుటుంబం గత టీడీపీ ప్రభుత్వ పాలన, నేటి ప్రభుత్వ పాలనకు గల తేడాను గమనించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు కోరారు. 'జగనన్నే మా భవిష్యత్'లో భాగంగా శనివారం స్థానిక మార్కెట్ వీధిలో సచివాలయ కన్వనర్లు, గృహసారథులతో కలిసి వారిరువురు పర్యటించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు బంగారుబాట వేసిన జగన్‌కు భవిష్యత్‌లో కూడా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, రాష్ట్ర బీసీ నాయకుడు మట్టపర్తి సూర్యచంద్రరావు, ఆర్య వైశ్య సంఘం నాయకుడు సుతాపల్లి నానారావు, పార్టీ బీసీ నాయకుడు మట్టపర్తి రమేష్, ఎస్సీ విభాగం నాయకులు పండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శంకరాయగూడెంలో జగనన్నే మా భవిష్యత్తులో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



కొత్తపేటలో లబ్ధిదారులను ప్రశ్నిస్తున్న డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు



పాశర్లపూడిలో జగనన్నే మా భవిష్యత్తులో పాల్గొన్న పార్టీ శ్రేణులు



రామేశ్వరంలో ఓ గృహిణి నుంచి అభిప్రాయాలు నమోదు చేస్తున్న శివకుమార్

జనం మెచ్చిన సీఎం జగన్



నేదునూరులో గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో జనం మెచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిగా పేరు పొందారని ఆయన సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తున్న వారి మన్ననలు పొందుతున్నారని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం అయినవిల్లి మండలం నేదునూరులో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి అర్హత పరిశీలించి పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను తర్వతగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రహదారులు నిర్మిస్తామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు జోగి బాబ్జి, కామన కృష్ణమూర్తి, రఘురాజు, గుత్తుల నాగబాబు, చైతన్య, కుడుపూడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

భారీ అన్నసమారాధన

అంబాజీపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక కొర్లపాటివారిపాలెంలో శ్రీరామ నవమి పందిరిలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లంక బ్రిడ్జి పనులు సత్వరమే ప్రారంభిస్తాం

అంబాజీపేట: పి.గన్నవరం మండలంలోని వరద ప్రభావిత లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ ఊడిమూడిలో నిర్మించే బ్రిడ్జి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో లంకవాసులతో శనివారం సమావేశం నిర్వహించారు. గత ఏడాది జూలైలో వచ్చిన వరదలకు ముంపునకు గురైన లంక గ్రామాల్లో పర్యటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ప్రజల కోరిక మేరకు బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. హామీ అమలులో భాగంగా రూ.49.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బ్రిడ్జిని ఎక్కడ నిర్మించాలనే దానిపై ఊడిమూడి, గంటి పెదపూడి వాసుల అనుమానాలను నివృత్తి చేసేందుకు రెండు గ్రామాల ప్రజలతో చర్చించామన్నారు. అరిగెలవారిపాలెం, గంటి పెదపూడిలంక, ఊడిమూడిలంక, బూరుగు లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే ఉచ్చులవారిపేట, చింతావారిపేటకు మధ్యలో కాలువపై చిన్న బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లంకగ్రామాల ప్రజలతో చర్చించి బ్రిడ్జి నిర్మాణ భూమిపూజకు తేదీని ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు మంతెన రవిరాజు, అంబాజీపేట, పి.గన్నవరం పార్టీ మండలశాఖ అధ్యక్షులు వాసంశెట్టి చిన బాబు, నక్కా వెంకటేశ్వరరావు, పి.గన్నవరం జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ రోగులకు వరం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌వో బి.అప్పారావు అన్నారు. నందంపూడి సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలోని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పితాని వీరాస్వామి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వడ్డాణం సమర్పణ



మహాలక్ష్మి అమ్మవారికి వెండి వడ్డాణాన్ని సమర్పిస్తున్న నానాజీ

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా యర్రంశెట్టి సత్యనారాయణ కుమారుడు వెంకటేశ్వరరావు (నానాజీ) శనివారం రూ.20 వేల విలువైన వెండి వడ్డాణాన్ని అమ్మవారికి సమర్పించారు. నానాజీ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పూజా ఘటానికి వెండి వడ్డాణాన్ని అలంకరించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

నల్లచెరువులో ధన్వంతరి హోమం

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామికి షష్టమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ధన్వంతరి విశేషార్చన, హోమం వంటి విశేష పూజలు జరిపారు. శాంతి హోమం, బలిహరణ, హనుమంత వాహన సేవ వంటి పూజలు జరిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

చికిత్సకు రూ.40 వేల సాయం



రోగికి సాయం అందజేస్తున్న ప్రతినిధులు

రాజోలు: బ్లడ్ క్యాన్సర్ చికిత్స నిమిత్తం కడలి గమ్మళ్లపాలానికి చెందిన కేతా సాయి దిలీప్‌నకు గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసమితి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. సాయాన్ని ఎంపీపీ కేతా శ్రీనివాస్, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్‌లు అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సమితి సేవలను అభినందించారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన వారంతా స్వగ్రామాల్లోని నిరుపేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. శెట్టిబలిజ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పి.గన్నవరం ఎస్సైగా హరికోటిశాస్త్రి



హరికోటి శాస్త్రి

పి.గన్నవరం: స్థానిక ఎస్సైగా హరికోటి శాస్త్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మలికిపురం స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి.గంగాభవాని డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఎస్సై హరికోటి శాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. మైనర్లు మోటారు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుట్కా, గంజాయి వంటి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చర్యలు తీసుకుంటామని కాయన అన్నారు.